క్లుప్తంగా

వైఎస్సార్ సీపీలో గొరకపూడి చేరిక



ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన చిన్నయ్యదొర

సామర్లకోట: భారతమాత సేవా పరిషత్తు వ్యవస్థాపక అధ్యక్షుడు, ఉమ్మడి రాష్ట్ర మున్సిపల్ కౌన్సిల్ చాంబర్ మాజీ అధ్యక్షుడు, జై భారత్ జాతీయ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు గొరకపూడి చిన్నయ్యదొర మంగళవారం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో పెద్దాపురం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దవులూరి దొరబాబు ఆధ్వర్యంలో మంగళవారం పార్టీలోనికి వచ్చిన వారికి సీఎం పార్టీ కండువా వేసి అభినందించారు. పేద ప్రజలకు జరుగుతున్న మేలును దృష్టిలో ఉంచుకుని పార్టీలోనికి చేరుతున్నట్లు గొరకపూడి చిన్నయ్యదొర సీఎంకు చెప్పారు. నియోజకవర్గంలో దొరబాబును అత్యధిక మెజార్టీతో గెలిపిస్తామని గొరకపూడి హామీ ఇచ్చారు.

జనసేన నాయకుడు వైఎస్సార్ సీపీలో చేరిక



వీరబాబుతో సుబ్బారావు తదితరులు

సామర్లకోట: మండల పరిధిలో నవర గ్రామానికి చెందిన జనసేన నాయకుడు గాదం వీరబాబు మంగళవారం వైఎస్సార్ సీపీలో చేరారు. స్థానిక వైఎస్సార్‌సీపీ క్యాంప్ కార్యాలయంలో దవులూరి చారిటబుల్ ట్రస్టు అధినేత దవులూరి సుబ్బారావు ఆయనను పార్టీలోకి ఆహ్వానించారు. సీఎం జగన్ సంక్షేమ పథకాలు, స్థానిక అభ్యర్థిగా మంచి వ్యక్తిగా దవులూరి దొరబాబు ఎంపిక కావడంతో నియోజక వర్గంలో వైఎస్సార్ సీపీ గెలుపు కోసం పార్టీలో చేరుతున్నట్లు వీరబాబు చెప్పారు. మండల పార్టీ అధ్యక్షుడు తాటికొండ అచ్చిరాజు, పట్టణ గృహసారథుల కన్వీనర్ ఇరుసుమళ్ల సాయి, మాలమహానాడు నాయకులు లింగం శివప్రసాద్, బీపెల్లి పండు తదితరులు పాల్గొన్నారు.

సమర్థంగా పోలింగ్ బూత్‌ల నిర్వహణ

ఎంసీసీ కన్వీనర్, ఎంపీడీఓ ఉషారాణి



కొండపల్లిలో పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీఓ ఉషారాణి

పెద్దాపురం: సార్వత్రిక ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించేందుకు పోలింగ్ బూత్‌ల నిర్వహణకు అన్ని చర్యలు చేపట్టినట్టు మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ (ఎంసీసీ) కన్వీనర్, ఎంపీడీఓ జి.ఉషారాణి అన్నారు. మండలంలోని వాలు తిమ్మాపురం, కొండపల్లి, ఆనూరు, చినబ్రహ్మదేవం గ్రామాల్లోని పోలింగ్ బూత్‌లను మంగళవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ పోలింగ్ బూత్‌ల వద్ద అన్ని సౌకర్యాలు కల్పించామన్నారు. తాగునీరు, విద్యుత్ సౌకర్యం, ర్యాంపులు, మరుగుదొడ్ల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సిబ్బందిని ఆదేశించారు. రాజకీయ పార్టీల పోస్టర్లు, ఫ్లెక్సీలు, స్టిక్కర్లు తొలగించాలన్నారు. స్వీప్ లక్ష్యానికి అనుగుణంగా కృషి చెయ్యాలని ఎంపీడీఓ ఆదేశించారు. అనంతరం ఆయా గ్రామాల్లో పోలింగ్ బూత్‌లను పరిశీలించి సిబ్బందికి సూచనలిచ్చారు. ఆమె వెంట పంచాయతీ కార్యదర్శులు వరసాల శ్రీనివాస్, త్సలికి దొరబాబు, శ్యామల, సచివాయల సిబ్బంది ఉన్నారు.

జీవశాస్త్ర పరీక్షకు 110 మంది గైర్హాజరు

సామర్లకోట: 10వ తరగతి పరీక్షల్లో భాగంగా మంగళవారం జీవశాస్త్ర పరీక్షకు 110 మంది గైర్హాజరైనట్టు ఎంఈఓ వై.శివరామకృష్ణయ్య తెలిపారు. మండల పరిధిలోని 9 పరీక్షా కేంద్రాల్లో 1624 మంది రెగ్యులర్ విద్యార్థులు, 278 మంది ప్రైవేటు విద్యార్థులు ఈ పరీక్ష రాయాల్సి ఉండగా రెగ్యులర్ విద్యార్థులు 18 మంది, ప్రైవేటు విద్యార్థులు 92 మంది డుమ్మా కొట్టారు. ప్రభుత్వ హైస్కూల్‌లో 13 మంది, జెడ్పీ బాలికల హైస్కూల్‌లో ఒకరు, అయోధ్యరామపురం మున్సిపల్ హైస్కూల్‌లో 20 మంది, ప్రతిభా విద్యానికేతన్‌లో ఆరుగురు, వేట్లపాలెం-ఎలో 24 మంది, వేట్లపాలెం-బిలో 25 మంది, వీకే రాయపురంలో 13 మంది, ఉండూరులో ఎనిమిది మంది రెగ్యులర్ విద్యార్థులు పరీక్షలకు డుమ్మా కొట్టారని వివరించారు. మంగళవారంతో పరీక్షలు ముగుస్తాయని ఎంఈఓ తెలిపారు. అయితే సంస్కృతం ఉన్న వారికి 30వ తేదీ వరకు పరీక్షలు ఉంటాయని చెప్పారు.

కర్షకానందం

పుట్టిన బిడ్డ ప్రయోజకుడైతే తండ్రికి ఎంత ఆనందం ఉంటుందో.. కష్టాల కడలిని దాటి.. పండించిన పంట చేతికందితే ఆ అన్నదాతకూ అంతే సంతృప్తి మిగులుతుంది. సాగునీటి సమస్య.. తెగుళ్లు, అకాల వర్షాలు వంటి వైపరీత్యాలు.. ఎదురైన సవాళ్లను అధిగమించి.. ఎట్టకేలకు రైతులు రబీ పంటను దక్కించుకున్నారు. రైతుల అదృష్టానికి తోడు.. ప్రభుత్వం అన్నదాతలకు అడుగడుగునా దన్నుగా నిలబడడంతో.. వారి సంతోషానికి అవధుల్లేవు.

- కోత దశకు చేరిన రబీ వరి పంట
- ముమ్మరంగా కోతలు, మాసూళ్లు
- రైతు భరోసాతో ఆనందంలో రైతాంగం



రహదారిపై ధాన్యం రాశులను ఆరబెడుతున్న రైతులు



పీబీసీ పరిధిలో యంత్రాలతో చేస్తున్న వరి కోతలు

పిఠాపురం: వ్యవసాయంలో రైతును కాపాడాలన్నా, ముంచేయాలన్నా నీటికే సాధ్యం. అటువంటి ప్రాధాన్యమున్న సాగునీరు ప్రస్తుతం పుష్కలంగా అందుతోంది. ఖరీఫ్‌లో అకాల వర్షాలు, వరదలు, తుఫాన్ల వల్ల కొంత మేర నష్టం కలిగినా, పంట దిగుబడి మాత్రం రైతుల్లో ఆనందాన్ని నింపాయి. ప్రస్తుత రబీ సీజన్‌లో వచ్చిన అకాల వర్షాలు రైతును కొంత ఇబ్బంది పెట్టినా, చివరకు సానుకూలంగానే కోతదశకు చేరాయి.

ప్రస్తుతం రబీ కోతలు ప్రారంభం కాగా, ఈ ఏడాది ఎక్కడా లేదు అనకుండా అన్ని చోట్ల రబీకి అవకాశం ఇవ్వడంతో.. రైతులు నిరాటంకంగా సాగు చేశారు. వాతావరణం ఇబ్బందులకు గురి చేసినా, నేనున్నానంటూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కర్షకులకు అందజేసిన రైతు భరోసాతో వారు ఆనందోత్సాహాల మధ్య రబీ కోతలు, అపరాల పంట సాగులో బిజీగా మారారు. ప్రభుత్వం నాన్చుడి ధోరణి లేకుండా ఏలేరు, పీబీసీ పరిధిలో రబీ సాగుపై అధికారులు నిర్ణయం ప్రకటించడంతో సకాలంలో సాగు పూర్తి చేశారు. పీబీసీ పరిధిలోని కొత్తపల్లి, పిఠాపురం, గొల్లప్రోలు తదితర ప్రాంతాల్లో ఇప్పటికే 80 శాతానికి పైగా వరిపంట కోతకు సిద్ధమవ్వగా, అపరాల సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు.

యంత్రాలపైనే ఆధారం

నియోజకవర్గ పరిధిలోని పిఠాపురం, కొత్తపల్లి మండలాల్లోనూ వరికోతలు చేపట్టేందుకు యంత్రాలను సిద్ధం చేస్తున్నారు. కూలీ రేట్లు అమాంతం పెరగడంతో, రైతులు వరి కోత యంత్రాలపైనే ఆధారపడుతున్నారు. ఎప్పుడూ లేని విధంగా 50 శాతానికి పైగా వరికోత యంత్రాలను ఆశ్రయించారు. వాతావరణం ఇబ్బందికరంగా మారుతుండడంతో పంటను త్వరితగతిన ఇంటికి చేర్చేందుకు ఈ వరికోత యంత్రాలను వినియోగించాల్సి వస్తోందని రైతులు చెబుతున్నారు. ఎకరాకు రూ.2,800 వరకు వరికోత యంత్రానికి అద్దెగా ఇస్తున్నామని అంటున్నారు. ప్రస్తుత కూలీ రేట్లతో బేరీజు వేసుకుంటే, వరికోత యంత్రం రైతుకు లాభసాటిగా మారిందంటున్నారు.

సిద్ధం అవుతున్న కొనుగోలు కేంద్రాలు

నియోజకవర్గ పరిధిలోని పిఠాపురం, గొల్లప్రోలు, కొత్తపల్లి మండలాల్లో వరికోతలు, నూర్పులు ముమ్మరంగా చేపట్టనున్న నేపథ్యంలో ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసే పనులు వేగవంతం చేసింది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వ్యవసాయ శాఖాధికారుల సమీక్షలో ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడంతో, ఇప్పటికే అధికారులు ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు రంగం సిద్ధం చేశారు. రైతులకు ఏ ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు పిఠాపురం వ్యవసాయ శాఖ ఏడీఏ పి.శాంతి ఇప్పటికే వెల్లడించారు.

ఊపందుకున్న వరి కోతలు, మాసూళ్లు

వాతావరణం అనుకూలించి, పంటలు చేతికందే పరిస్థితి కలిసొచ్చింది. రైతులు రబీ పంటల ఒబ్బిడి పనుల్లో నిమగ్నమయ్యారు. రబీ కోతలు ఊపందుకోవడంతో కోత కోసిన ధాన్యం ఇంటికి చేర్చుకునే పనిలో రైతన్నలు బిజీగా మారారు. యంత్రాలతో కోసిన వరి పంట తేమ తగ్గించడానికి కళ్లాల్లో కొన్ని రోజులు ఆరబెడుతున్నారు. వారం రోజులుగా కోతలు ప్రారంభం కాగా, ఇప్పటి వరకూ 20 శాతం వరి కోతలు పూర్తయ్యాయి. గత రెండు రోజుల నుంచి కోతలు ముమ్మరమయ్యాయి. ఎక్కువగా వరి కోతలు యంత్రాలతోనే చేపట్టారు. ప్రస్తుతం వాతావరణం అనుకూలంగా ఉండడంతో, మరో రెండు, మూడు రోజుల్లో మరో 40 శాతం కోతలు పూర్తవుతాయని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ఇప్పటికే రైతు భరోసా కేంద్రాల సిబ్బంది పొలాలను సందర్శించి, కోత పూర్తయిన పంటల విక్రయాలకు సంబంధించి రైతులకు సూచనలు ఇస్తున్నారు. ప్రస్తుతం దిగుబడులు ఆశాజనకంగానే ఉన్నాయని, ఈ నెలాఖరుకు వరి కోతలు వంద శాతం పూర్తవుతాయని పిఠాపురం వ్యవసాయ శాఖ ఏడీఏ స్వాతి తెలిపారు.

ఆరో తేదీ నుంచి విద్యార్థులకు పరీక్షలు

సామర్లకోట: ఒకటో తరగతి నుంచి 9వ తరగతి వరకు ఉన్న విద్యార్థులకు ఏప్రిల్ ఆరో తేదీ నుంచి పరీక్షలు ప్రారంభం కానున్నాయని ఎంఈఓ-2 పి.పుల్లయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒకటి నుంచి 8వ తరగతి విద్యార్థులకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, 9వ తరగతి విద్యార్థులకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12.15 వరకు పరీక్ష ఉంటుందన్నారు. ఒకటి నుంచి ఐదో తరగతి విద్యార్థులకు ఏప్రిల్ 16తో పరీక్షలు పూర్తి అవుతాయని, మిగిలిన విద్యార్థులకు 19 వరకు పరీక్షలు ఉంటాయని తెలిపారు.

వేసవి క్రీడా శిబిరాలకు దరఖాస్తుల ఆహ్వానం

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో మే 1 నుంచి 31 వరకు గ్రామీణ, అర్బన్ ప్రాంతాల్లో వివిధ క్రీడాంశాల్లో శిక్షణ శిబిరాల నిర్వహణకు అర్హులైన కోచ్‌లు, సీనియర్ క్రీడాకారుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఎస్‌డీఓ బి.శ్రీనివాస్ కుమార్ మంగళవారం తెలిపారు. కనిష్ఠంగా 20 మంది బాలురు, 20 మంది బాలికలతో ఈ శిబిరాలు నిర్వహించాలన్నారు. జిల్లాలోని క్రీడా సంఘాల ప్రతినిధులు, పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు, సీనియర్ క్రీడాకారులు తమ దరఖాస్తులు ఏప్రిల్ 2వ తేదీలోపు కాకినాడ జిల్లా క్రీడాప్రాధికార సంస్థ కార్యాలయంలో సమర్పించాలని, వివరాలకు 89196 42248 నెంబరులో సంప్రదించాలని కోరారు.

రజకుల సమస్యలు పరిష్కరించాలి

కాకినాడ సిటీ: రజకులు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా చాలా వెనుకబడి ఉన్నారని, 77 ఏళ్లుగా అనేక సమస్యలతో రజకులు ఇబ్బందులు పడుతున్నారని వీరి సమస్యలు తీర్చాలని ఏపీ రజక వృత్తిదారుల సంఘం జిల్లా సమావేశం డిమాండ్ చేసింది. మంగళవారం కాకినాడ సుందరయ్య భవన్‌లో నిర్వహించిన సంఘం సమావేశంలో పలువురు వక్తలు మాట్లాడారు. వృత్తి నిర్వహణలో యంత్రాలు ప్రవేశించినందున ఉపాధికి గండిపడే అవకాశం ఉందన్నారు. రజక వృత్తిదారులకు స్టీమ్ ఐరన్ ఇస్త్రీ చేసేందుకు 250 యూనిట్లు ఉచిత కరెంటు ఇవ్వాలన్నారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ సంస్థలు, దేవస్థానాల్లో ఉన్న రజక వృత్తి ఉపాధిని రజక యువతీ యువకులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రజక వృత్తి చెరువులు, కుంటలు స్థలాల పైన రజకులకే పూర్తి హక్కు కల్పించాలని, 50 ఏళ్లు పూర్తయిన రజకులకు వృద్ధాప్య పెన్షన్లు ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో రజక సంఘం నాయకులు కోనేటి రాజు, కొజ్జవరపు మాణిక్యం, కె.త్రిమూర్తులు, వి.రాజు, ఎస్.రాజేష్, సీహెచ్ శ్రీను, గంగాధరరావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఓటు వేయండి

వైఎస్సార్ సీపీ పిఠాపురం అసెంబ్లీ అభ్యర్థి వంగా గీత



జగ్గయ్యచెరువులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వంగా గీత



ఎన్నికల ప్రచారంలో వృద్ధురాలిని పలకరిస్తున్న వంగా గీత

పిఠాపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి తనను గెలిపించాలని వైఎస్సార్ సీపీ పిఠాపురం అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి వంగా గీత, ఎమ్మెల్యే పెండెం దొరబాబుతో కలిసి ఓటర్లను అభ్యర్థించారు. ఆమె పిఠాపురం జగ్గయ్యచెరువు కాలనీలో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం నిర్వహించిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. అందరినీ ఆప్యాయంగా పలకరించారు. స్థానిక మహిళలు పెద్దఎత్తున ఆమెకు ఘన స్వాగతం పలికారు. మీ వెంటే మేము ఉంటామంటూ భరోసా ఇచ్చారు. జగ్గయ్యచెరువు కాలనీని అభివృద్ధి చెందిన ప్రాంతంగా తీర్చిదిద్దుతానని, ఇప్పటికే పలు సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించామని వివరించారు. అన్ని మౌలిక సదుపాయాలు కల్పించడానికి చర్యలు తీసుకుంటామని ఆమె హామీ ఇచ్చారు. పేదల పెన్నిధిగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వారికి అవసరమైన విద్య, వైద్యం, అన్ని మౌలిక సదుపాయాలను అందించడంలో ముందున్నారన్నారు. అవినీతికి తావు లేకుండా, సంక్షేమ పథకాలు ప్రజల ముంగిటకే తీసుకొచ్చిన ఏకైక ముఖ్యమంత్రి సీఎం వైఎస్ జగన్ అని కొనియాడారు. బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి బాట వేశారన్నారు. కులమతాలకతీతంగా అన్ని వర్గాల సంక్షేమానికి ఆయన ఒకేలా భరోసా కల్పించారన్నారు. ఎమ్మెల్యే పెండెం దొరబాబు మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసే విధంగా ప్రజలు సహకరించాలని కోరారు. పిఠాపురం ఆడపడుచుగా అందరికీ సుపరిచితురాలైన వంగా గీతను అత్యధిక మెజారీతో గెలిపించడానికి అందరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు చింతాడ నీలవేణి, బండి రవి, కవ్వాడి పోతయ్య, బాలిపల్లి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలతో మమేకమవుతూ..

గొల్లప్రోలు: మండలంలోని ఎ.విజయనగరం గ్రామంలో మంగళవారం కాకినాడ ఎంపీ, వైఎస్సార్ సీపీ పిఠాపురం ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీత ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఎ.విజయనగరంలో ముదునూరి కొండబాబురాజుతో కలిసి ఇంటింటికీ వెళ్లి, ఓట్లను అభ్యర్థించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన సంక్షేమం, అభివృద్ధి ప్రజలకు వివరించారు. ఆమెకు ప్రతి ఇంటి వద్ద మహిళలు హారతులతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వంగా గీత మాట్లాడుతూ ప్రజల ముంగిటకే పాలన తెచ్చి, సంక్షేమ పథకాలను లబ్ధిదారుల ఇంటికే చేర్చిన దేశంలోనే ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని, పిఠాపురం ఎమ్మెల్యేగా తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ బుర్రా అనుబాబు, జెడ్పీటీసీ వులవకాయల నాగలోవరాజు, పార్టీ మండల అధ్యక్షుడు అరిగెల రామయ్య దొర, నాయకులు కడిమిశెట్టి భాస్కరరెడ్డి, ఆకుల శ్రీను, వెలుగుల సత్యనారాయణ, గొల్లపల్లి నానాజీ పాల్గొన్నారు.

ఏకే మల్లవరంలో..

మండలంలోని ఏకే మల్లవరం గ్రామంలో వంగా గీత ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు అరిగెల రామయ్యదొర ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి ప్రజలను ఓట్లు అభ్యర్థించారు.

మేము సిద్ధం మా బూత్ సిద్ధం ప్రచారం



సామర్లకోటలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

సామర్లకోట: రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం నుంచి ప్రారంభిస్తున్న మేము సిద్ధం యాత్ర ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా పట్టణ పరిధిలో ఇంటింటా మేము సిద్ధం కార్యక్రమం నిర్వహించారు. మేము సిద్ధం.. మా బూత్ సిద్ధం అంటూ ఇంటింటా పార్టీ జెండా, ఫ్యాను గుర్తుతో ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో 136 పోలింగ్ బూత్ పరిధిలో మంగళవారం రాత్రి మేము సిద్ధం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు జట్ల మోహన్, పట్టణ గృహసారథుల కన్వీనర్ ఇరుసుమళ్ల సాయి, పార్టీ నాయకులు బావిశెట్టి చక్రం, దేగల భాస్కర్, దన్నిన హరిబాబు, పెదిరెడ్ల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్ డిపాజిట్‌గా పది రూపాయల నాణేలు



నామినేషన్ డిపాజిట్‌గా ప్లేటులో పది రూపాయల నాణేలను తీసుకు వచ్చిన అభ్యర్థి రామదాస్

యానాం: పుదుచ్చేరి ఏకైక లోక్‌సభ స్థానానికి వచ్చే నెల 19న ఎన్నికలు నిర్వహించనున్న నేపథ్యంలో ఈ నెల 20 నుంచి నామినేషన్ల పర్వం ప్రారంభమైంది. నామినేషన్ల ప్రకియలో మంగళవారం ఓ ఆసక్తికర ఘటన చోటుచేసుకుంది. రామదాస్ అనే ఇండిపెండెంట్ అభ్యర్థి పుదుచ్చేరి కలెక్టర్ కార్యాలయానికి చేరుకుని తన నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి ఎ.కులొతుంగన్‌కు అందజేశారు. నామినేషన్ ధరావత్తు సెక్యూరిటీ డిపాజిట్‌గా చెల్లించాల్సిన రూ.12,500 సొమ్మును పది రూపాయల నాణేల రూపంలో పెద్ద ప్లేటులో తీసుకొచ్చి అందించారు. దీంతో ఎన్నికల సిబ్బంది ఆ నాణేలను లెక్కించి తీసుకున్నారు. ఇండిపెండెంట్‌గా నామినేషన్ దాఖలు చేసిన రామదాస్ ఓ లిక్కర్ షాపులో క్యాషియర్‌గా పనిచేస్తున్నారు. ఇటీవలి పది నాణేలను తీసుకోకుండా పలు చోట్ల తిరస్కరిస్తున్నారని, దీనిపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాలనే ఆలోచనతోనే అలా చేసినట్లు ఆయన తెలిపారు.

కచ్చితమైన సమాచారంతో ఓటరు జాబితా



సమావేశంలో మాట్లాడుతున్న నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి సీతారామారావు

సామర్లకోట: సార్వత్రిక ఎన్నికల ఓటరు జాబితాలో కచ్చితమైన సమాచారం ఉండాలని ఈఆర్వో జె సీతారామారావు అన్నారు. మంగళవారం మున్సిపల్ కమిషనర్ చాంబర్‌లో మున్సిపాలిటీ పరిధిలోని బీఎల్ఓల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే ఫైనల్ ఓటర్ల జాబితా తయారు కావడంతో మూడు, నాలుగు నెలల కిందట చనిపోయిన వారి పేర్లు ఓటరు జాబితాలో ఉంటే క్షమించేది లేదన్నారు. ఓటర్ల జాబితా ప్రచురించిన తరువాత చనిపోయిన వారి వివరాలను సేకరించి, వారికి సంబంధించిన మరణ సర్టిఫికెట్ల ఆధారంగా జాబితా నుంచి పేర్లను తొలగించాలన్నారు. అలాగే స్థానికంగా నివసించని వారి వివరాలు సేకరించి, వారికి మరో ప్రదేశంలో ఓటు ఉంటే అటువంటి ఓట్లు కూడా తొలగించాలన్నారు. 18 ఏళ్లు నిండిన వారిని కొత్త ఓటర్లుగా చేర్చుకోవడానికి ఫారం-6 లను ఏప్రిల్ 15 వరకు తీసుకోలని సూచించారు. ఏప్రిల్ 25 నాటికి అప్రూవల్ పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు. ప్రతీ బీఎల్ఓకు ఆయా పోలింగ్ బూత్‌లో ఉండే ఓట్లపై పూర్తి స్థాయిలో అవగాహన ఉండాలన్నారు. కొంత మంది బీఎల్ఓలు ఓటర్ల సంఖ్య సక్రమంగా చెప్పలేక పోవడంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. బీఎల్ఓల పని తీరును సూపర్‌వైజర్లు పర్యవేక్షించాలని సూచించారు. చనిపోయిన వారి పేర్లతో దొంగ ఓట్లు పడే ప్రమాదం ఉంటుందని హెచ్చరించారు. దీనిపై ప్రత్యేక దృష్టి సారించి ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించే బాధ్యత బీఎల్ఓలపై ఉన్నదని చెప్పారు. ఎన్నికల నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పని సరిగా పాటించేలా చూడాలన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందన్నారు. బీఎల్ఓలు ఆయా పోలింగ్ బూత్‌లను పరిశీలించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జె.రామారావు, టౌన్ ప్లానింగ్ అధికారి ఫణి కుమార్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు కచ్చితంగా పాటించాలి

పెద్దాపురం: స్థానిక ఆర్డీవో కార్యాలయ చాంబర్‌లో మంగళవారం నియోజకవర్గంలోని సామర్లకోట రూరల్ పరిధిలోని బీఎల్‌వోలతో ఎన్నికల ప్రక్రియపై శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో రామారావు మాట్లాడుతూ బీఎల్‌వోలు విధులను సక్రమంగా నిర్వర్తించాలని, కమిషన్ నిబంధనలపై మరింత పూర్తి అవగాహన పెంపొందించుకోవాలన్నారు. పోలింగ్ బూత్‌ల వద్ద సౌకర్యాలు కల్పించాలన్నారు. తాగునీరు, విద్యుత్ సౌకర్యం, ర్యాంపులు, మరుగుదొడ్ల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఓటు వేసే విధానంపై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈవీఎంలు ట్యాంపరింగ్ గురవుతున్నాయన్న అపోహలు ప్రజల్లో తొలగిపోవాలంటే వాటిపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత బీఎల్‌వోలపై ఉందన్నారు. వీవీ ప్యాట్, ఓటర్ వెరిఫికేషన్ పేపరు, ఆడిట్ ట్రైలర్‌పై పూర్తి సమాచారాన్ని తెలియజేయాలన్నారు. ఈవీఎంలో ఎవరికి ఓటు వేశారనేది ఎవరికీ తెలుసుకునే అవకాశం ఉండదన్నారు. అవగాహన లేమితో కొన్ని ఇబ్బందులు తలెత్తుతున్న నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఈ చర్యలు చేపట్టిందన్నారు. అనంతరం ఎలక్ట్రానిక్ ఓటింగ్ విధానం, పలు అంశాలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో సామర్లకోట తహసీల్దార్ శ్రీనివాస్, బీఎల్ఓలతో పాటు ఆయా శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వాననీటి బురదకు చెక్

- జేఎన్‌టీయూకేలో చురుగ్గా సీసీ రోడ్లు
- పదిహేనేళ్ల సమస్యకు మోక్షం
- హర్షం వ్యక్తం చేస్తున్న అధ్యాపక, విద్యార్థి సంఘాలు



వర్సిటీ ఆవరణలో నిర్మించిన సీసీ రోడ్లు

బాలాజీచెరువు: విద్యార్థులకు విద్యతో పాటు, మౌలిక సదుపాయాలు పూర్తి స్థాయిలో ఉన్నప్పుడే ఉత్తమ ఫలితాలు ఆశించవచ్చు. జేఎన్‌టీయూకే ఏర్పాటై పదిహేను సంవత్సరాలు పూర్తవుతున్నా దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యకు ఫుల్‌స్టాప్ పడింది. ముగ్గురు వీసీలు పనిచేసినా ప్రధాన సమస్యపై దృష్టి సారించలేదు. ఆర్థిక వనరులు ఉన్నా ప్రణాళికలు, సలహాలు, సూచనలు ఇచ్చే అధికారులు ఉన్నా వాటిని పరిగణలోకి తీసుకోకుండా అప్పటి వీసీలు కాలయాపన చేశారు. శంకుస్థాపనలు వంటి వాటితో సరిపెట్టారే తప్ప అడుగు కూడా ముందుకు పడలేదు. నిధులు పుష్కలంగా ఉన్నప్పటికీ ప్రధానంగా ఉన్న డ్రైనేజీపై స్పందించలేదు. కొద్దిపాటి వర్షం వస్తే వర్సిటీ చెరువును తలపించేది. ఇదే అవరణలో హాస్టల్ ఉండడంతో అక్కడ నుంచి తరగతులకు నడిచి వెళ్లడానికి విద్యార్థులు నానా అవస్థలు పడేవారు. వర్షాకాలం అయితే ఈ సమస్య మరింత వర్ణనాతీతం. నగర నడిమధ్యలో దాదాపు 70 ఎకరాల పైబడిన విస్తీర్ణంలో ఉన్న వర్సిటీలో వర్షాకాలం వస్తే సమస్యలు చెప్పనక్కర్లేదు. అధ్యాపకులతో పాటు దాదాపు 2 వేల మంది విద్యార్థులు, 700 మంది బోధనేతర సిబ్బందితో పాటు వివిధ పనులపై వర్సిటీకు అనుబంధ కళాశాలల జిల్లాల నుంచి వచ్చే వారు చెరువులా తలపించే వర్సిటీ ప్రాంగణంలో అనేక అవస్థలు పడేవారు. అలాగే వర్సిటీ అవరణలోని అధ్యాపకుల క్వార్టర్ల వద్ద నీరు నిలిచిపోవడంతో దోమల సమస్యతో నిత్యం నరకం అనుభవించేవారు. నాగావళి మహిళ హాస్టల్స్, పోస్టల్ కార్యాలయం పక్కన ఇలా ప్రతి ప్రాంతం నీటితో నిలిచిపోయి వర్షం పోయిన పది పదిహేను రోజుల వరకూ నీరు నిల్వ ఉండిపోయేది. దాదాపు 25 ఏళ్ల పాటు ఇదే కళాశాలలో ప్రొఫెసర్ స్థాయి నుంచి వివిధ బాధ్యతలు చేపట్టిన జీవీఆర్ ప్రసాదరాజు ఉన్నత స్థాయి అధికారులతో పలు మార్లు సంప్రదించి దీనిపై దృష్టి సారించి దాదాపు రూ.20 కోట్లతో రోడ్లు డ్రైనేజీలకు ప్రతిపాదనలతో పాటు టెండర్ల ప్రక్రియ నుంచి వెంటనే పూర్తి పనులు పూర్తి చేసేలా ప్రత్యేక శ్రద్ధ వహించారు.

సంతోషంగా ఉంది



ప్రధాన సమస్యకు మోక్షం కలగడంతో చాలా సంతోషంగా ఉంది. వర్సిటీలో ప్రధాన సమస్య డ్రైనేజీ, రోడ్ల ఏర్పాటుపై నిర్ణయం తీసుకోవడంతో పాటు వాటిని ప్రతివారం సమీక్షించి పూర్తిచేసేలా ఇంజినీరింగ్ అధికారుల సహకారంతో పూర్తిచేస్తున్నాం. ఏప్రిల్ నెలఖారు నాటికి పూర్తిచేసేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటాను.

– డాక్టర్ జీవీఆర్ ప్రసాద్‌రాజు, వీసీ, జేఎన్‌టీయూకే